# రుణాలతో మహిళలకు ఉపాధి

■ ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు



కిరణా, జనరల్ దుకాణాన్ని నడుపుతున్న మహిళ



బ్యాంక్ లింకేజీ ద్వారా తీసుకున్న రుణంతో బట్టలు అల్లుతున్న మహిళ

సారంగాపూర్, డిసెంబర్ 18 : మారుతున్న కాలానికి అనుగుణంగా సమాజంలో పలు మార్పులు చోటు చేసుకుంటున్నాయి. నచ్చిన ఆలోచనల విధానాలతో ప్రజలు తమ అభిరుచికి తగ్గట్టు వ్యాపారాలు చేసుకుంటూ స్వయం ఉపాధి పొందుతున్నారు. నాటి మహిళల ఆలోచన ధోరణిని పక్కన పెట్టి ఆధునిక మహిళలు ఆయా రంగాల్లో రాణిస్తున్నారు. ప్రభుత్వం సైతం తగిన తోడ్పాటు అందించడంతో మరింత ఉత్సాహంగా ముందుకెళ్తున్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఆధ్వర్యంలో మండలంలోని మహిళలు బ్యాంక్ లింకేజీ ద్వారా రుణాలు పొంది ఆర్థికంగా స్థిరత్వం పొందుతున్నారు. ఈ నేపథ్యంలో నమస్తే తెలంగాణ ప్రత్యేక కథనం.. ఆయా సంఘాల వివరాలు.. మండలంలో మొత్తం 721 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. ఇందులో 11,299 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. ఆయా సంఘాల సభ్యుల అవసరాలను బట్టి తీర్మానాలు, అందరి సమ్మతి ఆధారంగా రుణాలు ఇస్తున్నారు. బ్యాంక్ లింకేజీద్వారా సారంగాపూర్ మండలంలో 2023-2024 సంవత్సరానికి గానూ రూ. 38.51 కోట్లు లక్ష్యంగా ఉండగా ఇప్పటి వరకు 408 గ్రూపులకు రూ. 33.98 కోట్లు రుణాలు అందజేశారు. ఈ రుణాన్ని 12 శాతం వడ్డీతో ఇస్తున్నారు. తీసుకున్న రుణాన్ని 42 కాలల పరిమితితో రూ. లక్షకు రూ. 3వేల చొప్పున ప్రతి నెల వాయిదా చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. మండలంలో కొందరు మహిళలు గరిష్టంగా రూ. 10 నుంచి 20 లక్షలు తీసుకున్నారు.

**ఏర్పాటు చేసుకున్న వ్యాపారాలు..**

బ్యాంక్ లింకేజీ ద్వారా రుణాలు పొందిన మహిళలు తమ గ్రామాల్లో వ్యాపారంగా ఎరువుల దుకాణం, బట్టల దుకాణాలు, కిరాణం, లేడిస్ టేలర్, ఎంపోరియం, బేకరీ, పూజాసామగ్రి, టెంట్‌హౌస్, బిర్యాణి పాయింట్ తదితర వ్యాపార దుకాణాలను ఏర్పాటు చేసుకున్నారు. దీంతో ఎవరిపై ఆధారపడకుండా గ్రామాల్లోనే ఉంటూ బయట పనులకు వెళ్లకుండా స్వతగానే ఆర్థికంగా ఎదిగేలా కృషి చేస్తున్నారు. కుటుంబ పోషణలో తమవంతు పాత్ర పోషిస్తూ అండగా నిలుస్తు న్నారు. బయట బ్యాంకులు, ఇతర వ్యక్తుల వద్ద రుణాలు పొందాలంటే ఇబ్బందులు, షరతులతో పాటు వడ్డీ కూడా తక్కువగా ఉండడంతో మహిళలు ఆసక్తి చూపుతున్నారు.

**జీవనోపాధి కలుగుతుంది..**

రుణాలు పొందిన స్వయం సహాయ సంఘాల మహిళలు సొంతంగా వ్యాపారం ఏర్పాటు చేసుకొని స్వయం ఉపాధి పొందుతున్నారు. బయట పనులకు వెళ్లకుండానే వారికి తోడ్పాటు అందుతుంది. మహిళలకు రుణాలు ఇవ్వడంతో కుటుంబంలో సముచిత గౌరవం పెరుగుతున్నది. మరింత మంది మహిళలకు రుణాలు ఇచ్చేందుకు సిద్ధం ఉన్నాం.

**- మాధురి, ఏపీఎం, సారంగాపూర్**

## జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబర్ 18 : జాతీయ స్థాయి అత్యాపత్యా పోటీలకు నిర్మల్‌లోని జేవీఎన్ పాఠశాల విద్యార్థి జీ లోకేశ్ ఎంపికైనట్లు జిల్లా అత్యాపత్యా అసోసియేషన్ అధ్యక్షుడు వీ భూమన్న కార్యదర్శి జే సంజీవ్ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మణికుమారి, ఏవో మధుకర్, వ్యాయామ ఉపాధ్యాయుడు సంజీవ్ విద్యార్థిని అభినందించారు.



విద్యార్థిని అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు

## ముజ్గి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించండి

సోన్, డిసెంబర్ 18 : నిర్మల్ మండలం ముజ్గి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు, డిపో మేనేజర్ ప్రతిమారెడ్డిని సోమవారం నాయకులు కలిసి వినతిపత్రం అందించారు. నిర్మల్ నుంచి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉన్న తమ గ్రామానికి బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రైవేటు వాహనాల్లో ప్రయాణించాల్సి వస్తున్నదని, బస్సు సౌకర్యం కల్పించాలని కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు కోరారు. మాజీ ఎంపీపీ సాద సుదర్శన్, ఎఫ్ఎస్‌సీఎస్ మాజీ డైరెక్టర్ ఎంబరి గంగాధర్, నాయకులు పెద్దోళ్ల మహేందర్, బద్దం లింగారెడ్డి, డ్పి పోశెట్టి, శ్రీనివాస్, సాయన్న, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

## రాజరాజేశ్వర స్వామి ఆలయానికి ఎంపీపీ విరాళం

లక్ష్మణచాంద, డిసెంబర్ 18 : మండల కేంద్రంలోని రాజరాజేశ్వర స్వామి ఆలయానికి సోమవారం ఎంపీపీ అడ్వాల పద్మ రమేశ్ దంప తులు రూ. 50 వేలు విరాళం అందజేశారు. ఆలయ అభివృద్ధికి తనవంతుగా కృషిచేస్తానని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఓస రాజు, ఓస రాజన్న, ఆలయ అర్చకుడు ప్రహ్లాద శర్మ తదితరులు పాల్గొన్నారు.



ఆలయానికి విరాళం అందజేస్తున్న ఎంపీపీ అడ్వా పద్మ

### ఉపాధి హామీ పనుల పరిశీలన

దిలావర్‌పూర్ డిసెంబర్ 18 : మండలంలోని న్యూ లోలం,కాల్వ గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను సోమవారం ఎంపీడీవో మోహన్ ఈజీఎస్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. కూలీలతో మాట్లాడారు. పని కావాల్సిన వారు విధిగా గ్రామ పంచాయతీలో తమ పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. కూలీలు పని అడిగిన వెంటనే ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ పని కల్పించాలని కోరారు. అర్హులకు జాబ్ కార్డులు అందిస్తున్నామని తెలిపారు. ఈజీ ఎస్ ఏపీవో దివ్యారెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

### నేటి నుంచి ఉపాధి గ్రామసభలు

సారంగాపూర్, డిసెంబర్ 18 : మండలం లోని ఆయా గ్రామాల్లో మంగళవారం నుంచి 2024-2025 సంవత్సరానికి గానూ ఉపాధి హామీ పనుల ఎంపికపై గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఏపీవో లక్ష్మారెడ్డి తెలిపారు. 19న ఆలూర్, ప్యారమూర్, పొట్యా, 21న మహావీర్ తండా, వంజర్, బీరవెల్లి, 23న గోపాల్‌పేట్, కౌట్ల(బీ), 28న జామ్, నాగపూర్, జౌళి, 30న చించోలి(బీ), కంకెట, పెండల్‌ధరి, వచ్చే నెల జనవరి 2న హన్మాన్‌తండా, అడెల్లి, లింగాపూర్ గ్రామాల్లో సభలు ఉంటాయని పేర్కొన్నారు.

### గోశాలకు గడ్డి కట్టలు విరాళం

నర్సాపూర్(జీ), డిసెంబర్ 18 : మండలంలోని తురాటి గ్రామానికి చెందిన యువకులు కదిలి శివాలయంలో గల గోశాలకు, కల్లూరులో గల గోశాలకు 150 గడ్డి కట్టలను ఆలయ గోశాల నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా బొత్త సురేశ్ మాట్లాడుతూ గోవుల రక్షణ కోసం ప్రతి ఒక్కరూ ముందుకొచ్చి తమ వంతు సాయంగా గోశాలలకు పశుగ్రాసాన్ని అందించాలని కోరారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన డీఈవో

మామడ, డిసెంబర్ 18 : మండలంలోని కొరిటికల్ గ్రామానికి చెందిన విద్యార్థి ప్రజ్ఞ రెండు రోజుల క్రితం రాగి జావాలో పడి మృతి చెందింది. దీంతో కుటుంబ సభ్యులను సోమవారం జిల్లా విద్యాధికారి రవీందర్‌రెడ్డి పరమర్శిం చారు. ఈ సందర్భంగా మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే విద్యార్థిని మృతిపై మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ముత్యం, ఎంపీడీవో రమేశ్, ఎంపీవో గోవర్ధన్, పంచాయతీ కార్యదర్శి సురేశ్, ఉపాధ్యా యులు ఉన్నారు. డీసీసీ అధ్యక్షుడు కుచాడి శ్రీహరిరావు ప్రజ్ఞ కుటుంబాన్ని పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, బాపయ్య, శేఖర్, రఫీ, నర్సారెడ్డి, కిషన్ ఉన్నారు.




ఉపాధ్యాయులను అడిగి వివరాలు తెలుసుకుంటున్న డీఈవో రవీందర్‌రెడ్డి

**బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి**

నర్సాపూర్(జీ), డిసెంబర్ 18 : మామడ మండలం కొరిటికల్ ప్రాథమిక పాఠశాలలో జరిగిన ఘటనలో బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని మండలంలోని చాక్‌పల్లికి చెందిన సమాచార హక్కు చట్టం రాష్ట్ర ఎక్స్‌క్యూటివ్ మెంబర్ సయ్యద్ కలీం కలెక్టర్ సమీకృత కార్యాలయంలో విన్నవించారు. వేడి రాగి జావలో పడి ప్రజ్ఞ మరణానికి కారకులైన వారిపై చర్య తీసుకోవాలని ఈ ఘటనపై దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన సమయంలో తగు జాగ్రత్తలు పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో కిచెన్ షెడ్లను నిర్మించి మళ్లీ ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.




గ్రీవెన్స్ సెల్‌లో పాల్గొన్న అధికారులు

### ప్రజా ఫిర్యాదుల విభాగాన్ని సద్వినియోగం చేసుకోవాలి

లక్ష్మణచాంద, డిసెంబర్ 18 : ప్రజా ఫిర్యాదుల విభాగాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్రీలత పేర్కొన్నారు. సోమవారం తహసీల్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా అన్ని శాఖల అధికారులు ఆయా శాఖలపై వచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదులపై వెంటనే పరిష్కరిస్తామని ఆమె తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీడీవో శేఖర్, ఏవో ప్రవీణ్‌కుమార్, మండల విద్యాధికారి మధుసూదన్ పాల్గొన్నారు.

## ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి

లక్ష్మణచాంద, డిసెంబర్ 18 : ఉపాధి హామీమి పథకాన్ని కూలీలు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్డీవో విజయలక్ష్మీ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని నర్సాపూర్(డబ్ల్యూ) గ్రామంలో చేపట్టిన ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కూలీల హాజరు శాతం పెంచేలా క్షేత్రసహాయకులు కృషిచే యాలని సూచించారు. ఆయిల్‌పాం క్షేత్రాలను పరిశీ లించారు. ఆమె వెంట ఎంపీటీసీ గుజ్జారి గణేశ్, ఏపీవో ప్రమీల, సిబ్బంది పాల్గొన్నారు.



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న డీఆర్డీవో విజయ లక్ష్మి

### గ్రామాలన్నింటికీ బస్ సర్వీసులు నడిపించాలి

నిర్మల్ టౌన్, డిసెంబర్ 18 : కాంగ్రెస్ సర్కారు మహిళలకు మహాలక్ష్మి పథకాన్ని అమలు చేస్తున్న నేపథ్యంలో అన్ని గ్రామాలకు బస్ సౌకర్యం కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్య దర్శి బొమ్మెన సురేశ్ కోరారు. సోమవారం నిర్మల్ లో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. చాలా గ్రామాలకు బస్సులు రాకపోవడం వల్ల మహిళలు ఇబ్బందులకు గురవుతున్నారని తెలి పారు. నాయకులు భోజన్న, లలిత, సుగుణ, నందన, సుమాన్ బాయి పాల్గొన్నారు.